టీచర్ ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల టీచర్ ట్రైనింగ్ కోర్సులకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు సెల్: 9505800050.

నల్లకుంట ఎస్‌హెచ్‌ఓగా మారుతీప్రసాద్



నల్లకుంట: నల్లకుంట ఎస్‌హెచ్‌ఓగా కె.మారుతీప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న బి. జగదీశ్వర్‌రావు బదిలీపై స్పెషల్ బ్రాంచ్‌కి వెళ్లారు. ఆయన స్థానంలో పేట్ల బురుజు సీటీసీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మారుతీప్రసాద్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. 2007 బ్యాచ్‌కు చెందిన మారుతీప్రసాద్ మొదట ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పదోన్నతిపై రెయిన్‌బజార్ పీఎస్ డీఐగా వచ్చారు. అక్కడి నుంచి గద్వాల్ సీఐగా వెళ్లారు. తిరిగి హైదరాబాద్ వచ్చి షాహినాత్‌గంజ్ సీఐగా పని చేశారు.

రాష్ట్రానికి సరిపడ ఐఏఎస్, ఐపీఎస్‌లు లేరు

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: రాష్ట్రంలో పెరిగిన జిల్లాలకు అనుగుణంగా పాలనకు సరిపోను ఐఏఎస్, ఐపీఎస్‌లు లేరని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సమర్థులైన అధికారులను నియమించినప్పుడే రాష్ట్రం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో కూడా 563 గ్రూప్–1 అధికారులను గతంలో ఎప్పుడు రిక్రూట్ చేయలేదన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. గ్రూప్–1 పరీక్షల్లో అడుగడుగునా తప్పిదాలు జరిగాయని అన్నారు. వేలాది మంది జీవితాల భవిష్యత్‌లో చెలగాట మాడారని మండిపడ్డారు. రాష్ట్రంలో గ్రూప్స్‌లో అవకతవకలు జరిగినట్లు బలమైన ఆధారాలు ఉన్నందున వెంటనే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



సీడీఎంఏకు వినతిపత్రం అందజేస్తున్న ప్రగతిశీల వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

ముషీరాబాద్: తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యం మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ రంగంలో సుమారు 65 వేల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి మూడు కేటగిరీల వారీగా వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. కార్మికులందరికి రూ.26వేల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్‌పద్మ, సభ్యులు కిరణ్, బండారి మల్లేష్, శ్యామ్, రవికిరణ్, రవికుమార్, వేముల గురునాథం, కిన్నెర నారాయణ, రాజేందర్, ఎం.పార్థసారధి, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు ముస్తాబు.!

◆ 21నుంచి శారదా శరన్నవరాత్ర మహోత్సవాలు ◆ మొదటి రోజున శారదాంబకు మహాభిషేకం, జగత్ ప్రసూతిక అలంకారం





మఠం ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి విద్యుద్దీపాలతో ముస్తాబు

నల్లకుంట: శ్రీ జగద్గురు శంకరాచార్య దక్షిణామ్నాయ శ్రీశృంగేరి శారదా పీఠాధీశ్వరులు భారతీ తీర్థ మహా సన్నిధానం, శ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం అనుగ్రహ ఆశీస్సులతో ఈనెల 21 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శారదా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నల్లకుంటలోని శంకరమఠాన్ని ముస్తాబు చేస్తున్నారు. మఠం ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి, రంగులు అద్ది, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.

◆ గురువారం శంకరమఠం ధర్మాధికారి చింతపాటి శ్రీనివాసామూర్తి శారదా శరన్నవరాత్రి మహోత్సవాల వివరాలను 'సాక్షి'కి వివరించారు. 21వ తేదీన జగద్గురు శ్రీచంద్రశేఖర భారతీ మహాస్వామి ఆరాధన ఉంటుందన్నారు. అలాగే ఉదయం 7 గంటలకు శ్రీ శారదాంబకు మహాభిషేకం ఉంటుందన్నారు. అనంతరం శారదామాత జగత్ ప్రసూతిక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అలాగే 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 7గంటలకు దేవీ భాగవత ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారికి రథ సేవ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై శారదాంబ అనుగ్రహాశీస్సులు పొందాలని కోరారు.



శంకర మఠానికి రంగులు అద్దుతున్న దృశ్యం

నవరాత్రుల్లో శారదాంబ అమ్మవారి అలంకరణ వివరాలు

తేదీ	అలంకరణ
22న	బ్రాహ్మీ, కలశ స్థాపన
23న	మహేశ్వరి
24న	కౌమారి
25న	వైష్ణవి
26న	ఇంద్రాణి
27న	గజలక్ష్మి
28న	మోహిని
29న	సరస్వతి (మూలా నక్షత్రం)
30న	దుర్గాష్టమి, దుర్గ అలంకారం

అక్టోబర్ 01న మహార్నవమి, రాజరాజేశ్వరి అలంకారం, చండీహోమం, పూర్ణాహుతి ఉంటుంది.

అక్టోబర్ 02న కామధేను అలంకారం, విజయదశమి శమీపూజ ఉంటుంది.

యువత రక్తదానం చేయాలి



బర్కత్‌పుర బీజేపీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్.గౌతంరావు హాజరై మాట్లాడారు. రక్తదాన అవశ్యకతపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని పిలుపునిచ్చారు. రక్తదానంపై ప్రజలను చైతన్యం చేయడం మంచిదన్నారు. యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. ఆపదలో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రక్తం నిల్వలు లేక ఎంతో మంది ప్రాణాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రక్తదానం చేసిన రక్తదాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు లంకల దీపక్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, కన్నె ఉమారాణి, రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించండి

కాచిగూడ: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320బీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త స్పెన్సర్ లాల్ డిమాండ్ చేశారు. క్లబ్‌లో జరిగిన నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించిన లయన్స్ క్లబ్‌కు చెందిన ఓ మహిళా సభ్యురాలిని లయన్స్ క్లబ్ నుంచి బైలాకు విరుద్ధంగా తొలగించారని ఆయన ఆరోపించారు. శుక్రవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మరో సామాజిక కార్యకర్త రాజుతో కలిసి ఆయన మాట్లాడారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన లయన్స్ క్లబ్‌లో ఉన్న సీనియర్ సభ్యులైన ఆరుగురిపై సికింద్రాబాద్ కోర్టులో ప్రైవేట్ క్రిమినల్ కేసు దాఖలు చేశామన్నారు. సేవా కార్యక్రమాలకు నిలయమైన లయన్స్‌క్లబ్‌లో అవినీతికి పాల్పడిన వారిని వెంటనే లయన్స్ క్లబ్ సభ్యత్వం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సికింద్రాబాద్ లయన్స్ భవన్ ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. అక్రమంగా తొలగించిన మహిళకు లయన్స్ క్లబ్ సభ్యత్వాన్ని పునరుద్ధరించి న్యాయం జరిగేలా చూడాలని వారు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను కోరారు.

అడ్వకేట్స్ రక్షణ చట్టాన్ని తీసుకురావాలి



కాచిగూడలో న్యాయవాదుల 'న్యాయ దీక్ష'పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలంగాణ జూనియర్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద న్యాయ దీక్షను చేపట్టనున్నారు. కాచిగూడలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై 'న్యాయ దీక్ష'పోస్టర్‌ను ఆవిష్కరించారు. అడ్వకేట్స్ రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని అన్నారు. జూనియర్ న్యాయవాదుల స్టయిఫండ్‌ను రూ.15వేలకు పెంచాలని అన్నారు. న్యాయవాదులకు కొత్త ఆరోగ్య భీమా కార్డులను జారీచేయాలని కోరారు. న్యాయమూర్తుల నియామకం చేపడుతున్న కొలీజియంను రద్దు చేసి జ్యూడీషియల్ కమిషన్ ద్వారా నియామకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జక్కుల వంశీకృష్ణ అధ్యక్షతన జరిగింది.

'పొన్నం నారాయణగౌడ్ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తాళ్ల రాంపూర్‌లో ఈత వనాలను ధ్వంసం చేయడంతో పాటు గౌడ్లపై భౌతికదాడులు చేసిన వీడీసీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పొన్నం నారాయణగౌడ్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) వ్యవస్థను రద్దు చేయాలని గీతా వృత్తిదారులపై వారి అరాచకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన గౌడ సంఘం నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

చిక్కడపల్లి: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గం సీఎంఆర్‌ఎఫ్ 55 మంది లబ్ధిదారులకు రూ.18లక్షల 9వేల విలువగల చెక్కులను ఆయన అందజేవారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, టి.శంకర్‌ముదిరాజ్, వై.శ్రీనివాస్, కొండ శ్రీధర్‌రెడ్డి, బల్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన



చిక్కడపల్లి: మన చుట్టూ ఉన్న పరిసరాల్లోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలను ఆలోచిస్తే శాస్త్రవేత్తలు అవుతారని ఐఐసీటీ ముఖ్య శాస్త్రవేత్త ఎ.ఆంటోని అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నమూనాలను తిలకించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం శాంత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించాలి



సేవా పక్షం కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు

అంబర్‌పేట: విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గౌతంరావు తెలిపారు. బీజేపీ చేపట్టిన సేవ పక్షం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోల్నాక డివిజన్ మహిళ మోర్చా అధ్యక్షురాలు సావిత్రి ఆధ్వర్యంలో చిన్నారులకు చిత్రలేఖన పోటీలు జరిగాయి. గోల్నాకలోని ట్విన్‌సిటీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి గౌతంరావు హాజరై చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూల రవీందర్‌గౌడ్, శ్రీధర్, నర్సింగ్‌రావు యాదవ్, ఈశ్వర్, స్వప్న, రేణుక, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకు తనదైన శైలిలో వీహెచ్ ఆహ్వానం

అంబర్‌పేట: బతుకమ్మకుంటలో బతుకమ్మ సంబురాలు చేసుకోవడానికి ఆడపడుచులు రావాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతారావు ప్రజలను కోరారు. ఈనెల 26న పునరుద్ధరించిన బతుకుమ్మకుంట వద్ద బతుకమ్మ వేడుకలు ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. బతుకమ్మకుంటను 26న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి అందుబాటులోకి తేనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నారాయణ స్వామి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, పులి జగన్, శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్, కృష్ణగౌడ్, రామ్మోహన్, గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేటలో పర్యటించి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న కాంగ్రెస్ నేత వీహెచ్, నాయకులు

అభయ్-ఈశ్రమ్ కార్డుల పంపిణీ



ఈశ్రమ్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. శుక్రవారం గోల్నాకలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఎంపీఆర్డీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అభయ్–ఈశ్రమ్ కార్డుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కార్డులను అందించి భరోసా కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు నియోజకవర్గ ప్రజలకు అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ అందరికీ వర్తింపజేయాలి



బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న యూనియన్ నేతలు

కాచిగూడ: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ ఆప్షన్ చేసుకున్న వారందరికి అమలు చేయాలని హైదరాబాద్ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షన్ దారులు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పబ్లిక్ సెక్టార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సౌందర్ రాజన్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పెన్షన్‌దారులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.12వేలకు పెంచాలన్నారు. పెన్షన్‌దారుల గృహ నిర్మాణానికి బ్యాంకులకు బదులుగా ఈపీఎఫ్ నిధుల నుంచి చెల్లించాలని కోరారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు పీఎఫ్ కమిషనర్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, వెంకటాపురం దానకర్ణచారి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించనప్పుడే గుర్తింపు

ముషీరాబాద్: ప్రభుత్వ శాఖ అధికారులు స్వచ్ఛంద సంస్థ నేతలు ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి, బీహెచ్‌ఈఎల్ రిటైర్డ్ సీనియర్ మేనేజర్ ఆర్.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు వైద్యాధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఐశ్వర్యలను పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. వనిత, లక్ష్మీబాయి, లత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేరుగా ముంపు ప్రాంతాల్లోకే వెళ్లి..

- ముంపు బాధితుల సమస్యలు తెసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్
- వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటామని హామీ
- నీరు వెళ్లకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఫిర్యాదు



గగన్‌మహల్‌లో ముంపుబాధితులను సమస్యలు వింటున్న హైడ్రా కమిషనర్



అశోక్‌నగర్‌లో గోడును వినిపిస్తున్న వృద్ధురాలు



హుస్సేన్‌సాగర్ నాలా పరీవాహక ప్రాంత వాసుల సమస్యను వివరిస్తున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి/కవాడిగూడ: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలను శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి సమస్యలు తెలుసుకున్నారు. సర్కిల్–15 ఉపకమిషనర్ రామాంజులరెడ్డి, ఇంజినీరింగ్, ఇరిగేషన్ అధికారులతో కలసి అశోక్‌నగర్‌లో పర్యటించారు. హుస్సేన్‌సాగర్ నాలాను ఆనుకొని ఉన్న సత్యనారాయణస్వామి ఆలయం ప్రహరీ కూలిన ప్రదేశాన్ని పరిశీలించారు. వరద నీరు సాఫీగా వెళ్లకుండా అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ప్రహరీ నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ బీజేపీ కన్వీనర్ వినయ్‌కుమార్, స్థానికులు కృష్ణయ్య, కృష్ణమాచారి, మోహన్, రామకృష్ణ, కిరణ్, వీరప్రసాద్, భారతి, నవీన్‌కుమార్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, ఆనంద్‌రావు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

గగన్‌మహల్ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా...

రెండు రోజులుగా భారీ వర్షంతో వరదలు వచ్చి ఇబ్బందులు పడుతున్న దోమలగూడ గగన్‌మహల్ కాలనీ అపార్ట్‌మెంట్ వాసులను శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హుస్సేన్‌సాగర్ నాలా పూడికతీత సరిగా తీయకపోవడం వల్లనే అపార్ట్‌మెంట్‌లు మునిగాయని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ.. గగన్‌మహల్ స్ట్రీట్ నం.10లో హుస్సేన్‌సాగర్ నాలా వరద నీరు రివర్స్‌గా బయటికి వచ్చి ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సన్నీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయం ప్రహరీ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్,బీజేపీ నేత వినయ్, స్థానికులు



దోమలగూడ గగన్ మహల్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న నాలాను పరిశీలిస్తున్న హైడ్రా

ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- నిరుద్యోగులకు మద్దతుగా నగర కేంద్ర గ్రంథాలయంలో గడిపిన వైనం
- సీఎం గ్రంథాలయానికి వచ్చి చదివితే నిరుద్యోగుల కష్టాలు తెలుస్తాయి





చిక్కడపల్లి: ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నిరుద్యోగులకు మద్దతుగా చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో గంటపాటు పుస్తకాన్ని చదివారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గంట పాటు ఏకాగ్రతతో ఒక పుస్తకాన్ని చదవలేకపోయానని అన్నారు. గత మూడు నాలు సంవత్సరాల నుంచి చదివిన పుస్తకాలనే నిరుద్యోగులు చదువుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రంథాలయానికి వచ్చి చదివితే నిరుద్యోగుల కష్టాలు తెలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా వెంటనే 50వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లను విడుదల చేయాలన్నారు. ఇక్కడ ఎవరిని ఇబ్బంది పెట్టకుండా మళ్లీ చదువుకోవడానికి వస్తానన్నారు.

◆ గ్రంథాలయంలో ఏ పుస్తకం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఉందన్నారు. చదువుకోవడానికి వచ్చిన తనను ఎందుకు అడ్డుకుంటారని పోలీసులను ప్రశ్నించారు. నోటిఫికేషన్ల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అశోక్‌కుమార్‌ను పరామర్శించి వచ్చానన్నారు. ఆయనను అక్రమంగా అరెస్ట్ చేసి గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు కాకుండా వనస్థలిపురం ఆస్పత్రికి పంపడం అన్యాయమని అన్నారు. లక్షలాది నిరుద్యోగుల కోసం అశోక్‌కుమార్ పోరాడుతున్నారని తెలిపారు. తొలుత పోలీసులు ప్రవీణ్‌కుమార్‌ను లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. దీంతో ఆర్టికల్ 19 ప్రకారం దేశంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని, చదువుకోవడానికే వెళ్తున్నాని చెప్పడంతో లోపలికి అనుమతించారు.

ప్రత్యేక భారీ పోలీస్ బందోబస్తు...

◆ చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, డీఐ శంకర్‌మాలోతు, ముషీరాబాద్ సీఐ రాంబాబు, ఎస్సైలు అభిలాష్, మౌనిక, ప్రత్యేక పోలీసులు 6 వ్యాన్‌లు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.